# మహాత్ముడికి ఘన నివాళి

- ఘనంగా గాంధీ జయంతి వేడుకలు
- గాంధీ ఆశయాలను కొనసాగాలి : ఎమ్మెల్యే గంగుల

కార్పొరేషన్, అక్టోబర్ 2 : జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను బుధవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఊరూరా గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి బాపూజీ పోరాటాలను స్మరించుకున్నారు. కరీంనగర్‌లోని కార్ఖనగడ్డ, కోతిరాంపూర్‌లోని గాంధీ విగ్రహాలకు మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహింసాయుత పోరాటం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధింపజేసిన మహానుభావుడని, స్వేచ్ఛాభారతావనికి పునాది వేసిన గొప్ప మహనీయుడు మహాత్ముడు అని కొనియాడారు. గాంధీజీ కలలుగన్న ఆశయాలను సాధించేందుకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు.



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పక్కన మేయర్ యాదగిరి సునీల్‌రావు

# జీపీ సిబ్బంది పాదాలు కడిగిన ఎంపీడీవో



జీపీ సిబ్బంది పాదాలు కడుగుతున్న ఎంపీడీవో కాజామొహీనుద్దీన్

చిగురుమామిడి, అక్టోబర్ 2: గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామానికి చేసే సేవ వెలకట్టలేనిదంటూ ఓ ఎంపీడీవో వారి కాళ్లు కడిగి సన్మానించిన అరుదైన ఘటన చిగురుమామిడిలో జరిగింది. గాంధీ జయంతిని పురస్కరించుకుని చిగురుమామిడి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. అయితే చిగురుమామిడి గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో కాజామొహీనుద్దీన్ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీపీ సిబ్బంది సేవలను కొనియాడి, వారి పాదాలను కడిగి సన్మానించారు. గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామాల్లో చేపడుతున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.

# ‘పోషణ్ మహా’తో ఆరోగ్యం

- కట్టుదిట్టంగా అమలు చేయాలి
- అంగన్‌వాడీ టీచర్ల సేవలు అభినందనీయం
- మంథనిలో మంత్రి శ్రీధర్ బాబు




మహిళకు చీర సారె పెడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని, అక్టోబర్ 2: పిల్లలకు మంచి పోషకాహారం అందించే లక్ష్యంతో భారత ప్రభుత్వం ‘పోషణ్ మహా–24’ను తెచ్చిందని, ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ఈ కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. మంథనిలోని శివ కిరణ్ గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన ‘పోషన్ మహా– 24’ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి ఆయన పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు విశేష సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పుట్టిన శిశువు దగ్గరి నుంచి ఆరేండ్ల వయసు పిల్లల దాకా పోషకారం అందిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజం తయారవుతుందని చెప్పారు. జిల్లాలో ఎక్కడైనా అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల పోస్టులు ఖాళీ ఉంటే వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల ఆరోగ్య పరిస్థితులు చెక్ చేసేందుకు మెడికల్ క్యాంపు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. అనంతరం కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలు పూర్వ విద్యా కేంద్రాలుగా మారుతున్నాయని, కర దీపిక, ప్రియదర్శిని ప్రకారం పిల్లలకు ఆట పాటలతో బోధన అందించాలని సూచించారు. ఆ తర్వాత మంత్రి విలోచవరం అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంథని ఆర్డీవో హనుమా నాయక్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమ, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, సీడీపీవోలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# హామీలు ఇంకెప్పుడు అమలు చేస్తరు?

- ఆరు గ్యారెంటీలు ఇక అంతే సంగతులా..?
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, నాయకులు

గంగాధర, అక్టోబర్ 2: ‘ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపింది. 420 హామీలు ఇచ్చి నమ్మించి గెలిచింది. అధికారంలోకి వచ్చి ఇప్పటికి 300 రోజులు అవుతున్నది. హామీలు ఇంకెప్పుడు అమలు చేస్తరు’ అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. బుధవారం మధురానగర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు తీయని మాటలు చెబుతూ అందలం ఎక్కిందన్నారు. ఆరు గ్యారెంటీలలో ఫ్రీ బస్ మినహా మిగతా వాటన్నింటికి మంగళం పాడిందని విమర్శించారు. రేంవత్‌రెడ్డి సర్కారు హైడ్రా పేరిట పేదల ఇండ్లను కూల్చి వారి ఉసురు పోసుకుంటోందని మండిపడ్డారు. హైడ్రాపై ముఖ్యమంత్రి కానీ, మంత్రులు కానీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. గాంధీ జయంతి సందర్భంగా తాను మహాత్మాగాంధీని ఒక్కటే కోరుకుంటున్నానని, సీఎం రేవంత్‌రెడ్డికి కనువిప్పు కలిగించి ఆరు గ్యారంటీలు అమలు చేసేలా చూడాలని వేడుకున్నట్టు చెప్పారు. అనంతరం మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, నాయకులు సాగి మహిపాల్‌రావు, ఆకుల మధుసూదన్, మడ్లపెల్లి గంగాధర్, కంకణాల విజేందర్‌రెడ్డి, వేముల అంజి, శ్రీమల్ల మేఘరాజు, వేముల దామోదర్, వడ్లూరి ఆదిమల్లు, జోగు లక్ష్మీరాజం, లింగాల దుర్గయ్య, దోమకొండ మల్లయ్య, గంగాధర కుమార్ ఉన్నారు.

# ఏఈవోల మెడపై కత్తి!

## డిజిటల్ క్రాప్ సర్వే కోసం ఉక్కుపాదం మోపుతున్న సర్కారు

- సర్వే తమతో కాదంటున్న వ్యవసాయ విస్తరణాధికారులు
- విజ్ఞప్తులను పక్కన పెట్టి అధికారుల బెదిరింపులు
- వరంగల్ జిల్లాలో 59 మందికి షోకాజ్ నోటీసులు
- పెద్దపల్లి జిల్లాలో 40 మందికి రెండు రోజుల పాటు గైర్హాజర్
- ఇదే తరహాలో మరికొన్ని జిల్లాల్లో చర్యలు
- ఆందోళన బాటలో ఏఈవోలు
- పెన్‌డౌన్ సమ్మెవైపు కార్యాచరణ



మంగళవారం శంకరపట్నం వ్యవసాయ కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఏఈవోలు

డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) చేయడం తమ వల్ల కాదని రాష్ట్ర వ్యాప్తంగా ఏఈవోలు ఒకవైపు నెత్తీ నోరు మొత్తుకున్నా.. ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. సర్వే చేయడానికి ఏఈవోలు ఎందుకు నిరాకరిస్తున్నారో.. అందులోని సమస్యలేమిటో తెలుసుకోకుండా కచ్చితంగా చేసి తీరాల్సిందేనంటూ ఉక్కుపాదం మోపుతున్నది. అక్కడితో ఆగకుండా ఆయా జిల్లాల వ్యవసాయ అధికారులపై ఒత్తిడి పెంచుతూనే వ్యవసాయ విస్తరణాధికారులపై క్రమశిక్షణ చర్యలకు దిగుతున్నది. అందులో భాగంగానే వరంగల్ జిల్లాలో 59 మందికి అక్కడి జిల్లా వ్యవసాయధికారి షాకాజ్ నోటీసు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లాలో గత నెల 27, 28 తేదీల్లో 40 మంది విధులకు గైర్హాజర్ అయినట్టు రాష్ట్ర ప్రభుత్వానికి రిపోర్టు పంపించారు. ఇలా మెజార్టీ జిల్లాలో జిల్లాల్లో చర్యలు తీసుకుంటుండగా, ఏఈవోలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఒంటెత్తు పోకడపై సమ్మె బాట పట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

కరీంనగర్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : డిజిటల్ క్రాప్ సర్వే చేయలేమని రాష్ట్రంలో ఉన్న 2,604 మంది వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు) ముక్తకంఠంతో చెబుతున్నారు. ఇప్పటికే 49 రకాల విధులు నిర్వర్తిస్తున్న తమకు ఈ సర్వే తలకుమించిన భారం అవుతున్నదని ప్రభుత్వానికి ఇప్పటికే నివేదించారు. రైతు భరోసా, రైతు బీమా, పీఎం కిసాన్, పంట నష్టం సర్వే, పంట కోత ప్రయోగాలు, ధాన్యం సేకరణ, గ్రామాల వారీగా ప్రణాళిక, రుణమాఫీ కుటుంబ సర్వేల వంటి తదితర 49 రకాల విధులు నిర్వహిస్తూ మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. అలాగే ఒక్కో ఏఈవో పరిధిలో 4వేల నుంచి 8వేల మంది రైతులు, 6,500 నుంచి 8,500 ఎకరాలకు సంబంధించిన పనులను ఎటువంటి సహాయకులు లేకుండా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తుండడం వల్ల భారం పడుతున్నదని ఆవేదన చెందుతున్నారు. ఈ విధుల నిర్వహణకు తాము సహాయకులను అడుగుతుంటే.. డిజిటల్ క్రాప్ సర్వే పేరిట ప్రభుత్వం మరింత భారం మోపాలని చూడడం భావ్యం కాదన్న వాపోతున్నారు. అలాగే ఏఈవోల్లో 65 శాతం మంది మహిళలే ఉన్నారని, ఈ పరిస్థితులను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా.. ప్రభుత్వం క్రాప్ సర్వేకు ఒత్తిడి తేవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

### సహాయకులు లేకుంటే ఎలా సాధ్యం

ఒక్కో క్లస్టర్ పరిధిలో 15 నుంచి 20వేల ఫామ్స్ ఉంటాయి. పెద్ద క్లస్టర్‌లో అయితే 30వేలకు పైగా ఫామ్స్ ఉన్నాయి. క్రాప్ సర్వే కింద 15వేల ఫామ్స్ ఉన్న క్లస్టర్‌లో ఒక్కోఫామ్స్‌కు రెండు సార్లు వెళ్లినా ఒక క్రాప్ కాలంలో ఒక ఏఈవో 30వేల సార్లు వెళ్లాల్సి ఉంటుంది. అయితే ఇలా తిరగడం సాధ్యమయ్యే పనియేనా? అని ఏఈవోలు ప్రశ్నిస్తున్నారు. క్రాప్ సర్వే నిబంధనల ప్రకారం 25 మీటర్లకు ఒక ఫొటో తీయాల్సి ఉంటుందని, ఒకవేళ 25 మీటర్లలోపు కూడా వేర్వేరు పంటలుంటే ఆ ఫొటోలు వేర్వేరుగా తీయాల్సి ఉంటుందని, ఆ లెక్కన చూస్తే ఎకరానికి సగటున 20 ఫొటోలు తీసినా 8,500 ఎకరాలున్న క్లస్టర్ పరిధిలో 1,70,000 ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, ఇటువంటి సమయంలో సహాయకులు లేకుండా ఎలా సాధ్యమవుతుందో ప్రభుత్వమే చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. గ్రామ భౌగోళిక విస్తీర్ణాన్ని సర్వే చేసేప్పుడు బీడు భూములు, సర్వేనంబర్లు, ఫారెస్టు ల్యాండ్ వంటివి ఉంటాయి. నిజానికి వ్యవసాయ శాఖ ఏఈవోల్లో 65 శాతం మంది మహిళలున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నిర్మానుష్య ప్రాంతాల్లో మహిళలు సర్వే చేయడం సాధ్యం కాదని, తద్వారా వారి భద్రతకే ప్రమాదం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ క్రాప్ సర్వేలో ఇటువంటి అనేక కష్టాలు, లోటుపాట్లు ఉన్నాయని, అందుకే ఈ సర్వేకు పక్కరాష్ట్రాలు అనుసరించిన విధానాన్ని మన రాష్ట్రంలో అమలు చేయాలంటూ పలుసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశామని ఏఈవోలు చెబుతున్నారు.

### మొదలైన చర్యలు

క్రాప్ సర్వేచేయడం సాధ్యం కాదని, పక్కరాష్ట్రాలు అనుసరించిన విధానాన్ని అమలు చేస్తే తాము సహకరిస్తామని ఒక వైపు ఏఈవోలు ముక్తకంఠంతో చెబుతున్నా.. సర్కారు మాత్రం ఆ మాటలను పెడచెవిన పెట్టడమే కాదు, బెదిరింపులకు పాల్పడుతున్నది. క్రాప్ సర్వేకు సంబంధించి యాప్‌ను వెంటనే ఏఈవోలు తమ సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకొని, సర్వేను ప్రారంభించకపోతే క్రమశిక్షణ చర్యలుంటాయని హెచ్చరించడమే కాదు, ఏకంగా ఆచరణలో పెడుతున్నది. అందులో భాగంగానే సదరు యాప్ డౌన్‌లోడ్ చేసుకోక పోవడంతోపాటు సర్వేలు చేయకుండా విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొంటూ వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి ఇటీవల 59 మంది ఏఈవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అంతేకాదు, నోటీస్ అందుకున్న తదుపరి 24 గంటల్లో వివరణ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. అలాగే పెద్దపల్లి జిల్లాలో 40 మంది ఏఈవోలు యాప్ డౌన్‌లోడ్ చేసుకోలేదని, క్రాప్ సర్వే విధులను నిర్వహించడం లేదని గత నెల 27, 28 తేదీల్లో గైర్హాజర్ (ఆబ్సెంట్) వేస్తూ ప్రభుత్వానికి పంపించారు. ఇదే తరహాలో మరికొన్ని జిల్లాల్లోనూ జిల్లా వ్యవసాధికారులు చర్యలకు ఉపక్రమించినట్టు తెలుస్తున్నది. ఇదే విషయాన్ని ఆయా జిల్లాల వ్యవసాధికారుల వద్దకు వెళ్లి ఏఈవోల సంఘాలు ప్రశ్నిస్తే.. తమను ఈ విషయంలో ఏమీ అడగొద్దని, పైనుంచి వచ్చే ఆదేశాల ప్రకారం తాము నడుచుకుంటున్నామని చెబుతున్నట్టు తెలుస్తున్నది. ఒకవేళ చర్యలు తీసుకోకపోతే తమ ఉద్యోగాలకే ఎసరు వచ్చే పరిస్థితులున్నాయని అంటున్నట్టు తెలుస్తున్నది. అలాగే ఒకటి రెండు రోజుల్లో మరిన్ని కఠిన చర్యలు తీసుకునేందుకు సర్కారు చర్యలు చేపట్టినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఏఈవోల సంఘం షోకాజ్ నోటీసులు, ఆబ్సెంట్‌ల విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నది. దీనిపై ఏదో ఒక స్పష్టత రావాలంటే ఆందోళన బాట పట్టాలన్న నిర్ణయానికి రాగా, రాష్ట్ర టీఎన్జీవో సంఘం కూడా మద్దతిస్తున్నది. అయితే ఒకటి రెండు రోజుల్లో మరోసారి ప్రభుత్వంతో మాట్లాడుదామని, అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే.. ఏఈవోల సంఘం చేసే ఆందోళన కార్యక్రమాలు, ముఖ్యంగా పెన్‌డౌన్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని టీఎన్జీవో రాష్ట్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ చెప్పినట్టు తెలుస్తున్నది. తాజా పరిస్థితులు చూస్తుంటే.. ప్రభుత్వం మొండిగా వెళ్తన్నందునే ఆందోళనబాట పట్టేందుకు ఏఈవోల రాష్ట్ర సంఘం కార్యాచరణ సిద్ధం చేసినట్టు కొంతమంది నాయకులు తెలిపారు.

# బేషరతుగా క్షణమాపణ చెప్పాలి

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



కార్పొరేషన్, అక్టోబర్ 2 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణలపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా స్పందించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడడం సరికాదని, భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కొండా సురేఖ మాట్లాడిన బూతు మాటలను తెలంగాణ ప్రజలు ఇంకా మరిచిపోలేదని గుర్తు చేశారు. ఆమె ఇప్పుడు ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి బాధ్యతారహితంగా మాట్లాడడం చాలా బాధాకరమన్నారు. మీకున్న పదవితో ప్రజలకు మంచి పనులు చేసి వార్తల్లోకి రావాలని హితవు పలికారు.



కరీంనగర్: రాంనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కరీంనగర్: అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు, మహిళలు





వేములవాడ టౌన్: రాజన్న ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గోదావరిఖని: మార్కండేయకాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# ఎంగిలిపూల సంబురం

## కనుల పండువగా మొదలైన బతుకమ్మ వేడుకలు

ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం వేళ కూడళ్లలో ఉంచి ఆటపాటలతో సందడి చేశారు. ‘బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో’..అంటూ ఆటపాటల్లో మునిగితేలారు. చీకటి పడ్డ తర్వాత బతుకమ్మ తెప్పలు, సమీపంలోని వాగులు, ఒర్రెల్లో నిమజ్జనం చేశారు. వేములవాడ రాజన్న ఆలయ ఆవరణలో మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మ ఆడారు.

- కమాన్ చౌరస్తా, అక్టోబర్ 2



కరీంనగర్: రాంనగర్ వేడుకల్లో యువతులు



కరీంనగర్: ట్రినిటీ కళాశాల బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు